# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 12, నవంబరు, 2014

హైదరాబాద్ వాతావరణ పరిస్థితులు, భౌగోళిక స్థితిగతులు మాత్రమే కాకుండా హుస్సేన్‌సాగర్ కూడా ఓ గొప్ప వరమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అభివర్ణించారు. అలాంటి హుస్సేన్‌సాగర్‌ను పరిశుభ్రమైన మంచినీటి సరస్సుగా మార్చడంతో పాటు దాని చుట్టూ ఆకాశ హర్మ్యాలు నిర్మించాలని ముఖ్యమంత్రి సంకల్పించారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ నిర్మించే భారీ టవర్స్ నగరానికే ఓ మణిహారంగా ఉండాలని ఆకాంక్షించారు. క్యాంప్ కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి రెవిన్యూ అధికారులతో హుస్సేన్‌సాగర్ చుట్టూ ఉన్న అనువైన ప్రాంతాలపై సమీక్ష నిర్వహించారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ 60 నుండి 100 అంతస్తుల ఎత్తైన టవర్స్ నిర్మించే ప్రతిపాదనలపై సుదీర్ఘంగా చర్చించారు. టవర్ల నమూనాలను కూడా పరిశీలించారు. అంబేడ్కర్ విగ్రహం పక్క నుండే బోట్స్ క్లబ్ నుండి మొదలు కొని నెక్లెస్ రోడ్డు, జలవిహార్, అంబేడ్కర్ నగర్, సంజీవయ్య పార్క్,సికింద్రాబాద్ బోట్స్ క్లబ్, మారియట్ హోటల్, డిబిఆర్ మిల్స్, లోయర్ ట్యాంక్ బండ్, సెక్రటేరియట్ తదితర ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న స్థలాలను, ప్రభుత్వ స్థలాలను ముఖ్యమంత్రి గూగుల్ మ్యాప్ సహాయంతో పరిశీలించారు. డిబిఆర్ మిల్స్ స్థలంలో, మారియట్ హోటల్‌కు ఎదురుగా ఉన్న ఖాలి స్థలంలో, నెక్లెస్ రోడ్డుకు రైల్వే ట్రాక్‌కు మధ్య ఉన్న స్థలంలో, అంబేడ్కర్ నగర్ ప్రాంతంలో, సంజీవయ్య పార్క్ స్థలంలో, హైదరాబాద్, సికింద్రాబాద్ బోట్స్ క్లబ్ స్థలాల్లో, జలవిహార్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో అద్భుతమైన టవర్స్ నిర్మించవచ్చని ముఖ్యమంత్రి చెప్పారు. రెవిన్యూ అధికారులు వెంటనే రంగంలోకి దిగి ఈ స్థలాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ ఉన్న భూములన్నింటిలో ప్రతి అడుగుకు సంబంధించిన పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని కోరారు. హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దాలనే తపన తెలంగాణ ప్రభుత్వానికి ఉందని, అంతర్జాతీయ నగరాలకు ఉండే ఆకర్షణ, ప్రత్యేకతల్లో బహుళ అంతస్తుల భవనాలు కూడా చాలా ముఖ్యమైనవని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో మరే నగరానికి హైదరాబాద్ తీసిపోదని నిరూపించాలని చెప్పారు. బహుళ అంతస్తుల భవనాల వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. తక్కువ స్థలంలో ఎక్కువ కార్యకలాపాలు నిర్వహించడం సాధ్యమవుతుందని, ప్రజలకు కావలసిన ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు, వినోద కేంద్రాలు, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు దగ్గర దగ్గరే ఉండడం ఉపయోగకరమన్నారు. మలేషియాలోని

కౌలాలంపూర్ పెట్రోనస్ టవర్స్, ముంబయ్ లోని సముద్ర తీరంలో ఉన్న టవర్స్ ఇందుకు ఉదాహరణగా ముఖ్యమంత్రి చెప్పారు. ఈలాంటి టవర్స్ నిర్మించడానికి అనేక సంస్థలు ముందుకు వస్తాయని కూడా వెల్లడించారు. బహుళ అంతస్తులు నిర్మించడానికి అవరొధంగా వున్న నిబంధనలను కూడా మారుస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రభుత్వమే టవర్స్ నిర్మించి ఇతర సంస్థలకు లీజుకు ఇవ్వడమా? నిర్మాణ బాధ్యతలను కూడా ఇతర సంస్థలకు అప్పగించడమా? ఏలాంటి పద్ధతులు ఇందు కోసం అనుసరించాలి? అనే విషయాలపై అధ్యయనం చేయాలన్నారు. నెక్లెస్ రోడ్డులో ప్రస్తుతం నగర వాసులు సేద తీరడానికి ఉపయోగిస్తున్న స్థలంలో ఏలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని, మరింత సుందరంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చెప్పారు. జలవిహార్, లుంబిని పార్క్ తదితర ప్రాంతాల్లో వినోద కార్యకలపాలు సాగుతున్నాయని, వాటిలో కూడా ఆధునికత రావాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయి వినోద కేంద్రాలు లుంబిని పార్క్, సంజీవయ్య పార్క్, ఇందిరాపార్క్, జలవిహార్ ప్రాంతాల్లో మెరుగుపడాలన్నారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ ఉన్న స్థలాల్లో కొందరు పేదలు నివసిస్తున్నారని, అవసరమైతే వారికి కూడా టవర్లలోని గృహవసతి కల్పించాలని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రతిపాదిత టవర్లలో స్టార్ హోటల్లు, పర్యాటకుల విడిది నిలయాలుగా ఉంటాయని చెప్పారు. అందమైన, అద్భుతమైన టవర్ల సరసననే అంబేడ్కర్ నగర్ కాలనీ వాసుల కోసం కూడా మంచి టవర్ నిర్మించి ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. హుస్సేన్‌సాగర్‌ను కూడా పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని సూచించారు. ఎండాకాలంలో హుస్సేన్‌సాగర్‌లోని నీటినంతా ఖాళీ చేసి అడుగు భాగంలోని చెత్తా చెదారాన్ని తొలగించాలని చెప్పారు. హుస్సేన్‌సాగర్‌లోకి మురుగు నీరు రాకుండా మళ్లింపు కాల్వను తవ్వాలని చెప్పారు. టవర్ల నుండి వచ్చే మురికి నీరు కూడా హుస్సేన్‌సాగర్‌లో కలవకుండా నేరుగా మురికి కాలువలోకి పోయేటట్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజి సిస్టం ఉంటుందని వెల్లడించారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ ఉన్న భూములపై వెంటనే సర్వే నిర్వహించి లే అవుట్లు డిజైన్ చేయాలని, కోర్టు వివాదాలు ఏమైనా ఉంటే కూడా వెంటనే పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలని ముఖ్యమంత్రి చెప్పారు.

సమీక్షలో సికింద్రాబాద్ ఆర్‌డిఓ రఘురామ శర్మతో పాటు, నగర పరిధిలోని పలువురు తహశీల్దారులు, ఆర్ఐలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం